# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 17 జూన్ 2024 | ADILABAD NIRMAL


## బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్



నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూన్ 16 : నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా అభిలాష అభినవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిలాష అభినవ్‌కు నిర్మల్ కలెక్టర్‌గా బదిలీగా బదిలీపై వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను ఆర్డీవో, ఇతర జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాసర కిటకిట



అమ్మవారి దర్శనానికి భక్తుల బారులు

బాసర, జూన్ 16 : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. అమ్మవారి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి బారులు దీరారు. పాఠశాలలకు పునఃప్రారంభం అయిన దృష్ట్యా విద్యార్థులు అత్యధికంగా తరలివచ్చారు. అదే విధంగా భక్తులు తమ చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు చేయించారు. దీంతో అక్షరశ్రీకార మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాహలం కనిపించింది.



పూర్తిగా కొట్టుకుపోయిన సిరాల ప్రాజెక్టు ప్రధాన ఆనకట్ట



కట్ట తెగిపోకముందు నీటితో కళకళలాడుతున్న సిరాల ప్రాజెక్టు

# సిరాల.. రైతు కన్నీరు..

- గతేడాది భారీ వర్షాలతో కొట్టుకుపోయిన ప్రధాన ఆనకట్ట
- యేడాది గడిచినా పునర్నిర్మాణం ఊసేలేదు..
- ఇప్పటికీ ఎటు చూసినా ఇసుక మేటలు.. బండరాళ్లే..
- ప్రకటనల్లోనే మంజూరు.. ప్రారంభంకాని పనులు..
- 121 సంవత్సరాల చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం
- కట్ట పనులు ప్రారంభించాలని రైతన్నల వేడుకోలు



బంజర భూమిని తలపిస్తున్న సాగు భూమి



బీడుగా మారిన వ్యవసాయ భూమి

భైంసా టౌన్, జూన్ 16 : గతేడాది కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ఆనకట్ట కొట్టుకుపోయింది. ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సిరాల బాట పట్టి రైతులకు ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ.. యేడాదైనా వారిచ్చిన భరోసా హామీగానే మిగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత కట్ట నిర్మాణంతోపాటు ఇతర పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.12.36 కోట్లు కేటాయించారు. కానీ.. అవి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఈ యేడాది వర్షాలు ప్రారంభమైనా.. పనుల ఊసే లేదు.

### గతేడాది పిల్లాపాపలతో ఆలయంలోనే జాగారం

గతేడాది జూలై 27న కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ఎగువన పలు చెరువులు తెగిపోవడంతో ప్రాజెక్టులోకి సామర్థ్యానికి మించి భారీగా వరద నీరు చేరింది. దీంతో కట్టపై నుంచి నీరు కిందికి వచ్చింది. రాబోయే ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు పక్కనే గుట్టపై ఉన్న శివాలయంలో పిల్లాపాపలతో తలదాచుకున్నారు. భయంతో ఆలయానికి చేరుకుంటున్న సమయంలోనే ప్రధాన తూముకు గండి పడింది. మరికొద్ది సేపటికే కట్టపై ఉన్న రామస్వామి ఆలయం వద్ద ఇంకో గండి పడింది. క్షణాల్లో రామస్వామి ఆలయం నీటిలో కొట్టుకుపోయింది. ఇప్పుడు అక్కడ గుడి అనే ఆనవాళ్లు కూడా లేవు. చూస్తుండగానే కట్ట మొత్తం కొట్టుకుపోవడంతో నీరంతా సిరాల గ్రామం చుట్టూ ప్రవహిస్తూ పొలాల్లోకి చేరింది. దిగువన ఉన్న సిరాల, ఇలేగాం, దేగాం, వాలేగాం, కామోల్ గ్రామాల్లోని పొలాలతోపాటు ఇళ్లలో కూడా నీరు చేరింది.

### ఈసారి సాగుకు నిరాశే..

కట్ట తెగిన వరద ప్రవాహంతో పంటలన్నీ కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ప్రాజెక్టు పునర్నిర్మాణంపై బోలెడు ఆశలు పెట్టుకున్నారు. వరుస కట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు సిరాలను సందర్శించడంతో వర్షాలు ప్రారంభమయ్యేలోపు ప్రధాన ఆనకట్ట పనులు పూర్తి చేస్తారని అనుకున్నారు. ప్రాజెక్టు పునర్నిర్మాణం మంజూరు, పనుల ప్రారంభం కేవలం ప్రకటనలకే పరిమితమవడంతో మరో యేడాది రెండు పంటలను నష్టపోయే పరిస్థితి వచ్చింది. ఈసారి కూడా రైతులు తమ కన్నీళ్లతోనే సాగును ప్రారంభించాల్సి వస్తున్నది.

### సాగు, తాగునీటికి కష్టాలు ఎదుర్కొంటున్నాం..



గతేడాది భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ప్రధాన ఆనకట్ట కొట్టుకుపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. వర్షాలు కురిసేలోపు కట్టను నిర్మిస్తారనుకుంటే ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. కట్ట తెగినప్పుడు నెల రోజులపాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామానికి వచ్చి పరామర్శల పేరిట హడావుడి చేశారు. ఆనకట్ట నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది కూడా మేము రెండు పంటలను నష్టపోవాల్సి వస్తున్నది. తాగునీటికి కూడా కష్టాలు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆనకట్ట నిర్మాణానికి కృషి చేయాలని కోరుకుంటున్నాం.

-సతీశ్, మాజీ సర్పంచ్, సిరాల

### తీవ్రంగా నష్టపోయాం..



గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ప్రధాన ఆనకట్ట తెగిపోవడంతో మా గ్రామంలోని రైతులు 200 ఎకరాల్లో పంటను నష్టపోయారు. ఇళ్లలోకి కూడా నీళ్లు వచ్చాయి. ఈసారి కూడా పంటలు పండించే పరిస్థితి కనబడడం లేదు. భారీ వర్షాలు కురిస్తే మహారాష్ట్ర నుంచి సిరాల ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. కట్టలేని కారణంగా వచ్చిన నీరు వచ్చినట్లే వెళ్లిపోతూ పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు తెగడంతో ఇప్పటికే ఆయకట్టు రైతులు రెండు పంటలు నష్టపోయాం. ఈ యేడాది కూడా రెండు పంటలను నష్టపోవాల్సి వస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగం మా కష్టాలను గుర్తించి త్వరిత గతిన ఆనకట్ట కట్టాలి. గతేడాది నష్టపోయిన పంటలకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదు. త్వరగా అందించాలి.

- పోతన్న, రైతు, వాలేగాం

### ఇప్పటికీ ఎటు చూసినా ఇసుక మేటలు.. బండరాళ్లే..

పంట భూముల్లోకి పెద్ద పెద్ద బండరాళ్లు వచ్చి చేరాయి. ఇసుక మేటలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. సిరాల, ఇలేగాం, దేగాం, వాలేగాం, కామోల్ వరకు ఈ ప్రాజెక్టు వరద నీటిలో 800 ఎకరాల భూములు నీట మునిగాయి. 300 ఎకరాలకుపైగా భూముల్లో పూర్తిగా బండరాళ్లు, ఇసుక మేటలు వేశాయి. నీట మునిగిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. నష్టపోయిన రైతుల భూములను బాగు చేసి ఇవ్వలేదు. నాలుగు కిలో మీటర్ల మేర కొట్టుకుపోయిన సీసీ కెనాల్ పనులను ప్రారంభించలేదు. వర్షాలు వస్తే నీరంతా సీసీ కెనాల్ కింద ఉండే భూములను ముంచెత్తనుంది.



బండరాళ్లతో నిండిన సాగు భూములు

### ప్రాజెక్టుకు 121 ఏళ్ల చరిత్ర

1902 సంవత్సరంలో నిర్మించిన సిరాల ప్రాజెక్టుకు 121 ఏండ్ల చరిత్ర ఉంది. అప్పట్లో అతి తక్కువ ఖర్చుతో రెండు గుట్టల మధ్య నిర్మించారు. ఎప్పుడు నీటితో కళకళలాడుతూ ఉండే ఈ ప్రాజెక్టు కింద ఏడు గ్రామాల్లోని నాలుగు వేల ఎకరాలకు నీరందేది. తర్వాత పూడిక చేరడంతో 1,400 ఎకరాలకే నీటిని అందిస్తున్నది. భారీ వర్షాలతో ప్రధాన కట్ట కొట్టుకుపోవడంతో 121 ఏళ్ల చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం నెలకున్నది.

# నేడు బక్రీద్

- వేడుకలకు ఈద్గాలు, మసీదులు ముస్తాబు
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

దండేపల్లి /చెన్నూర్ టౌన్/ జైనూర్, జూన్ 16 : ఇబ్రహీం అలైహిస్సాలాం త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే ఈద్-ఉల్-అజ్‌హా(బక్రీద్)కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పండుగ విశిష్టత..

అల్లాహ్ ముఖ్య ప్రవక్త హ‌జ్రత్ ఇబ్రహీం ఇస్లాం విశ్వాసాలను ప్రపంచమంతా ప్రచారం చేసేవాడు. ఇబ్రహీంకు పెళ్లయిన చాలా ఏండ్లకు కుమారుడు జన్మిస్తాడు. అతనికి ఇస్మాయిల్ అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకుంటాడు. అల్లాహ్(దైవం) వరుసగా మూడు రోజులు ఇబ్రహీం కలలోకి వచ్చి 'నీ కుమారుడిని బలి ఇవ్వాలి' అని సందేశాన్ని వినిపిస్తాడు. అల్లాహ్ కోసం ఇబ్రహీంతో పాటు ఆయన భార్య అంగీకరిస్తారు. తన తండ్రి తీసుకున్న నిర్ణయానికి ఇస్మాయిల్ సంతోషంగా ప్రాణత్యాగానికి సిద్ధమవుతాడు. దీంతో అల్లాహ్ దైవవాణి ద్వారా 'ఇబ్రహీం ఇది నిన్ను పరీక్షించేందుకే..నా పరీక్షలో నీవు గెలిచావు. కుమారుడి బదులు ఓ జీవాన్ని (గొర్రె)బలి ఇవ్వు' అని కోరుతాడు. ఆ రోజును బక్రీద్‌గా నిర్వహిస్తున్నారు. ఖుర్బానీగా జంతువును బలి ఇస్తున్నారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్‌హజ్ 22న బక్రీద్‌ను జరుపుకుంటారు. బక్రీద్‌కు ముందు రోజు కుటుంబ సభ్యుల సమాధుల వద్ద వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాలు, వస్తువులు ఉంచుతారు.

### ఖుర్బానీ సమర్పించడం ఆనవాయితీ..

రంజాన్ మాదిరిగానే బక్రీద్ పండుగను కూడా ఖుద్బా(ధార్మిక ప్రసంగం)తో ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆ తర్వాత నెమరువేసే జంతువులు (ఒంటే, మేక, గొర్రె ) మాత్రమే ఖుర్బానీ(బలి) ఇస్తారు. బలి ఇచ్చిన తర్వాత దానిని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని పేదలకు, మరొక భాగాన్ని బంధువులకు పంచుతారు. ఇంకో భాగం తమ కోసం ఉంచుకుంటారు. హజ్ చేయలేని వారు కేవలం తామున్న చోటే అందరూ కలిసి సామూహికంగా నమాజ్ చేసుకోని ఖుర్బానీ సమర్పించుకొని పండుగ చేసుకుంటారు.

### ఈద్గాల ముస్తాబు..

ఖుర్బానీ(బలి)ఇచ్చేందుకు మేకలు, గొర్రెలను ఇప్పటికే కొనుగోలు చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు దండేపల్లి, తాళ్లపేట, ముత్యంపేట, లక్షెట్టిపేట, జన్నారం, చెన్నూర్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జైనూర్ మండలం జంగాం, గౌరి, తదితర గ్రామాల్లో ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో పోలీసులు పీస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

## భారీ బందోబస్తు

### ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూన్ 16 : బక్రీద్ పండుగను ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. జిల్లావాసులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బందోబస్తు నిర్వహించే అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఆరు అంతర్రాష్ట్ర, ఆరు అంతర్ జిల్లాల సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ఐదుగురు సిబ్బందిని ఏర్పాటు చేసి, 24 గంటలు వాహనాల తనిఖీని చేపట్టి ఆవుల అక్రమ రవాణాను జరగకుండా చూశామని పేర్కొన్నారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ వంటి మూడు ప్రధాన పట్టణాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, సీఐలు ఏ.అశోక్, కె.సత్యనారాయణ, సాయినాథ్ పాల్గొన్నారు.

## అభిమాన నాయకుడికి
# శుభాకాంక్షల వెల్లువ



పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యేతో కలిసి సందడి చేస్తున్న యువకులు

నేరడిగొండ, జూన్ 16 : బోథ్ నియోజకవర్గ ప్రజల అభిమాన నాయకుడు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. దీంతో మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల నుంచి అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి శాలువా కప్పి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంచారు. దీంతో మండల కేంద్రంలోని ఆయన నివాసం వద్ద అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో సందడి నెలకున్నది.

# దారితప్పుతున్న నాలుగో సింహం



- పోలీసుశాఖ కీర్తి ప్రతిష్టకు అవినీతి మచ్చ
- ఎస్సైతోపాటు కింది స్థాయి ఉద్యోగుల చేతివాటం
- తాజాగా అవకతవకల ఘటనలో ఎస్సై సస్పెన్షన్
- కఠిన చర్యలకు వెనుకాడని పోలీసు శాఖ

నిర్మల్ అర్బన్, జూన్ 16 : ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ శాంతి భద్రతల రక్షణకు పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తున్నది. సమస్యల పరిష్కారానికి వచ్చే బాధితులకు మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. ఫలితంగా పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మెరుగు పడుతున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. కొంత మంది అధికారులు, కిందిస్థాయి సిబ్బంది పనితీరుతో పోలీసు శాఖకు మచ్చతెస్తున్నారు. అప్పుడప్పుడు ఎస్సై స్థాయి అధికారులతోపాటు సిబ్బంది అవినీతి పనులకు పాల్పడుతున్నారు. తమ శాఖ వారే కదా అని తప్పును కప్పి పుచ్చుకోకుండా సస్పెండ్ చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. కొంత మంది అధికారులు చేస్తున్న అవినీతిమరకలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ప్రజల్లో పోలీసు శాఖ నమ్మకాన్ని నిలబెడుతున్నారు.

### పోలీసు శాఖకు అవినీతి మచ్చ

- జిల్లాలో కొంతమంది పోలీసులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పేకాట, అక్రమంగా మొరం తవ్వకాలు, ఇసుక రవాణాలో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని మైనింగ్, రెవెన్యూ శాఖలకు అప్పజెపుతున్నారు. దీంతో వారిని మచ్చిక చేసుకుని పలువురు పోలీసులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### మచ్చుకు కొన్ని ఘటనలు..

- ప్రస్తుతం నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రమోహన్, అంతకుముందు నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్, ఆ తర్వాత సారంగాపూర్ ఠాణాల్లో విధులు నిర్వహించాడు. నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ రోడ్డు ప్రమాదానికి సంబంధించి వాస్తవాలను దాచి యజమానికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. సారంగాపూర్ ఠాణాలో కూడా విధులు నిర్వహించే క్రమంలో జూదరులను ప్రోత్సహించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారులు మందలించినా మార్పు రాలేదు. వీటిపై విచారణ జరిపిన అధికారులు సస్పెండ్ చేశారు
- నిర్మల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో అవుట్ పోస్టు విభాగంలో పని చేస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్ యువతితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన పోలీసులు హెడ్ కానిస్టేబుల్‌ని సస్పెండ్ చేశారు.
- నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి తక్కువ ధరకే ఇసుక, కంకర, బిల్డింగ్ సామగ్రి ఇస్తానని వసూళ్లకు పాల్పడ్డాడు. విచారణలో వాస్తవం తేలడంతో అధికారులు అతడిని సస్పెండ్ చేశారు.




నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయం

- పట్టణంలోని ఓ లాడ్జిలో మహిళపై అత్యాచారయత్నం ఆరోపణపై సీసీఎస్ విభాగంలో పని చేసే ఓ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.
- పట్టణంలోని భీమన్న గుట్ట వద్ద ఓ రివాల్వర్ ఉన్నట్లు స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అది సర్వీస్ రివాల్వరని ఏఆర్ కానిస్టేబుల్‌ది అని గుర్తించారు. దీంతో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.
- పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలోని సంఘ భవనంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకున్నారు. అందులో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఉండడంతో వారిద్దరిని సస్పెండ్ చేశారు.

### అధికారుల దృష్టికి వస్తే సస్పెండే..

పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించేలా, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఎస్పీ జానకి షర్మిల కఠిన చర్యలకు వెనుకాడడం లేదు. ఇప్పటికే పోలీసు శాఖలో పలు విభాగాల్లో పాతుకుపోయిన వారిని బదిలీ చేస్తూ పాలనను గాడిలో పడేశారు. కేసులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటూ నిందితులకు శిక్షలు పడేలా చూస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. పోలీసు శాఖను అభాసుపాలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన వారిపై సమగ్ర విచారణ జరుపుతూ వారిపైవారిపై శాఖాపరమైన చర్యలకు వెనుకాడడంవెనుకాడడం లేదు. ఇలా అవినీతితో శాఖకు మచ్చతెచ్చిన వారిపై శాఖాపరమైన చర్యలు, సస్పెండ్ చేస్తూ ప్రజల్లో పోలీసులకు నమ్మకాన్ని కల్గిస్తున్నారు.

## ఎస్పీ గౌష్ ఆలంకు ప్రశంసాపత్రం అందజేత



ఎస్పీకి ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో సత్కరిస్తున్న పోలీసులు

ఎదులాపురం, జూన్ 16 : పార్లమెంట్ ఎన్నికలను ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు ఎస్పీ గౌష్ ఆలంకు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్ ద్వారా ప్రశంసాపత్రం వచ్చింది. ఈ క్రమంలో ఆదివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ ఎస్పీకి శాలువాతో సత్కరించి, సిబ్బందితో కలిసి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన జిల్లా పోలీసులందరికీ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సీసీ దుర్గం శ్రీనివాస్, ఆర్ఐ సీఐ నవీన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ అన్వర్ ఉల్ హక్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది సైబర్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సంజీవ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది విజయ్, మాజిద్ పాల్గొన్నారు.